సాక్షి
అనకాపల్లి
గురువారం । 27 । జూలై । 2023





**29న సైకిళ్ల పంపిణీ** 8లో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9 తరగతుల విద్యార్థినులకు 29న సైకిళ్లు పంపిణీ చేస్తామని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు.



**అక్రమంగా టేకు కలప తరలింపు**

బొలేరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్టు అటవీ శాఖ చోడవరం రేంజర్ తెలిపారు. 8లో



**సూక్ష్మసాగుకు ప్రోత్సాహం**

బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నట్టు జిల్లా సూక్ష్మసాగు నీటి వనరుల పీడీ తెలిపారు. 8లో

## న్యూస్‌రీల్

### విద్యాప్రమాణాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**మాకవరపాలెం:** విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. మండలంలోని భీమబోయినపాలెం కస్తూర్బా పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ అమలుపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తీర్ణతా శాతం పెరగాలని, ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం వలంటీర్ల ద్వారా జరుగుతున్న డ్రాపౌట్స్ సర్వేపై దృష్టిపెట్టాలని ఎంపీడీవో అరుణశ్రీకి సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎంఈవో మూర్తి ఉన్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా వైద్యాధికారి హేమంత్



వడ్డాది ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

**బుచ్చెయ్యపేట:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో) ఎ.హేమంత్ తెలిపారు. వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి, బంగారుమెట్టలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. వడ్డాది ఆస్పత్రిలో మందుల నిల్వలు,రికార్డులను పరిశీలించారు. రోజువారీ ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, సీజనల్ వ్యాధులు,మందులు నిల్వలపై ఆయన వైద్యాధికారి మౌనికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి బావులు, కుళాయిలు, బోర్లు వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలని, క్లోరినేషన్ చేయాలని తెలిపారు. బంగారుమెట్టలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్యాధికారి శకుంతలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

### రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పతంజలి కేంద్రం క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న యోగా గురువు సతీష్

**చోడవరం:** రాష్ట్రస్థాయి యోగా పోటీలకు స్థానిక పతంజలి యోగా కేంద్రం క్రీడాకారులు ఎంపికైనట్టు యోగా గురువు పుల్లేటి సతీష్ బుధవారం తెలిపారు. యోగాసనాల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న అనకాపల్లిలో జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో పతంజలి యోగా కేంద్రం క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించారని ఆయన చెప్పారు. బాలుర విభాగంలో వి.హరిదుర్గ, జి.హేమంత్‌శ్రీను, ధనుష్, పి.క్రాంతిసాగర్, జి. లయవర్ధన్, పి.పవన్ కుమార్, వి.పూర్ణచంద్రరావు, కె. హరికిరణ్ పతకాలు సాధించారన్నారు. బాలికల విభాగంలో పందిరి వెన్నెలశ్రీ, ఎం.శ్రీహిత పతకాలు సాధించారని చెప్పారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ఎంపికయ్యారని సతీష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను యోగాకేంద్రం ప్రతినిధులు అభినందించారు.

# దంచికొట్టిన వర్షం

జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు, వంకలు పొంగిప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరుతోంది.



విశాఖ రామకృష్ణ జంక్షన్ వద్ద నీటిలో ఆర్టీసీ బస్సు



దిమిలిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

- నేడూ భారీ వర్షాలకు అవకాశం

**సాక్షి, విశాఖపట్నం:** వరుణుడు వదలకుండా వర్షాలను కురిపిస్తున్నాడు. అనకాపల్లి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో గడిచిన 24 గంటల్లో 1551.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జీపీవో జి.రామారావు తెలిపారు. మునగపాక శీలప్పన్న చెరువులో నీటి ఉధృతి పెరగడంతో రక్షణ గోడ కూలిపోయింది. చెరువును ఆనుకుని నివాసం ఉంటున్న ఆదారి ముసిలినాయుడు ఇంటి వెనుకభాగం కుంగిపోయింది. అల్పపీడనం కారణంగా మత్స్యకారులు చేపల వేటకు విరామం ప్రకటించారు. తెప్పలు, ఇంజన్లు, వలలను ఒడ్డున భద్రపరచి ఇళ్లకే పరిమితమయ్యారు. అలలు కూడా ఉధృతంగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయని మత్స్యకారులు తెలిపారు. వాతావరణ తీవ్రత తగ్గుముఖం పట్టే వరకు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చీడికాడలో 5 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వానలు బుధవారం మరింత ఉధృతమయ్యాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకంటే విశాఖ జిల్లాలో అత్యంత భారీ వర్షం కురిసింది. వర్షానికి నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. వర్షం తీవ్రతకు ఆర్కే బీచ్‌లోని సముద్రతీరం భారీగా కోతకు గురైంది. ఎఎస్సార్ జిల్లా ఎటపాకలో 7 సెం.మీల వర్షపాతం నమోదైంది.



భారీ వర్షం కారణంగా కోతకు గురైన ఆర్.కె.బీచ్



పొంగి ప్రవహిస్తున్న శారదానది

**నేడూ కొనసాగనున్న వర్షాలు**

ఉమ్మడి విశాఖలో గురువారం కూడా వర్షాలు కొనసాగనున్నాయి. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గంటకు 45–55 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉండడం వల్ల మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది.

# రిజర్వాయర్లకు జలకళ



రావణాపల్లి రిజర్వాయరు



తాండవ జలాశయం

**నర్సీపట్నం :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. పెద్ద ఎత్తున నీరు చేరడంతో రిజర్వాయర్లకు జలకళ వచ్చింది. డివిజన్‌లో ప్రధాన రిజర్వాయర్లు అయిన తాండవ, కల్యాణపులోవ, రావణాపల్లిలో ఇన్‌ఫ్లో పెరిగి నిండుగా దర్శనమిస్తున్నాయి. తాండవకు 1900క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. గరిష్టస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 370.3 అడుగులకు చేరింది. కల్యాణపులోవకు 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. గరిష్ట నీటి మట్టం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 450.8కు చేరింది. ఈ రెండు రోజుల్లో రెండు అడుగుల నీటి మట్టం పెరిగినట్టు అధికారులు తెలిపారు. నర్సీపట్నం సమీపంలో ఉన్న రావణాపల్లి రిజర్వాయర్ గరిష్టస్థాయి నీటి మట్టం 358 అడుగులు కాగా, ప్రస్తుతం 352కు చేరింది. దీని ఇన్‌ఫ్లో 30 నుంచి 50 క్యూసెక్కులు ఉంటోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ఇన్‌ఫ్లో మరింత పెరిగి నీటిమట్టాలు పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రిజర్వాయర్లను ఆనుకుని ఖరీఫ్ సాగుకు అదనపు ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**వరాహాకు వరద నీరు..**

**కోటవురట్ల:** వరాహానదికి చాలా కాలానికి జలకళ వచ్చింది. సుమారు ఏడాదిగా ఎండిపోయి ఎడారిని తలపించిన వరాహనది ప్రస్తుతం వరద నీటితో కళకళలాడుతోంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాలకు నదిలోకి వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. పాతరోడ్డు వద్ద సర్పానది కూడా కలియడంతో అక్కడ మరింత ప్రవాహం కనిపిస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**109.50 మీటర్లకు రైవాడ నీటి మట్టం**

**దేవరాపల్లి:** క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో రైవాడ జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. 800 క్యూసెక్కులు చేరినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 109.50 మీటర్లకు నీరు చేరింది. శారదానదికి ఆనుకొని ఉన్న తెనుగుపూడి సచివాలయ ప్రహరీ కూలిపోయింది. శారదానది గట్టు వర్షం ధాటికి కోరుకుపోవడంతో శారదానది వైపు ఒరిగిపోయి గోడ పడిపోయింది.



కైలాసపట్నం వద్ద వరాహానదిలో వరదనీరు



తెనుగుపూడిలో శారదానదిగట్టు కోరుకుపోవడంతో కూలిన ప్రహరీ

# ప్రభుత్వ బడుల్లో ఆధునిక బోధన



పాఠశాల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**అనకాపల్లిటౌన్:** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన చేస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. నాడు–నేడు పథకంలో మండలంలో పాయప్పపాలెం ఎంపీపీ పాఠశాలను రూ.18.31లక్షలతో అభివృద్ధి చేశారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని బుధవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచిఫలితాలు సాధించారని చెప్పారు. వచ్చే ఏడాది పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషిచేయాలన్నారు. అంతకుముందు విద్యార్థులతో పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిధుల మంజూరుకు వినతి



రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ సత్యవతి



కేంద్ర కార్మికశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ సత్యవతి

**అనకాపల్లిటౌన్:** జిల్లాలోని అనకాపల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో పలు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, భూపేంద్రయాదవ్‌ను అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. మంత్రులను బుధవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనకాపల్లి మండలంలో సత్యనారాయణపురం రైల్వే అండర్‌పాస్ నిర్మాణపనులు, పరవాడ మండలంలో లంకెలపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌ను ఎంపీ బుధవారం కోరారు. ఢిల్లీలో మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ఇప్పటికే పూర్తి రైల్వే నిధులతో నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు మంజూరు చేశారని, నిధులు మంజూరు చేసి ఆయా ప్రాంతాల వాసుల చిరకాల స్వప్నం సాకారమయ్యే విధంగా సహకారం అందించాలని కోరారు.

అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో 30 పడకల(ఈఎస్‌ఐ) ఆస్పత్రి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వైద్యులు, సిబ్బంది వసతి నిర్మాణాలకు అదనపు నిధులు మంజూరు చేయాలని కేంద్ర కార్మికశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఎంపీ సత్యవతి కోరారు. ఢిల్లీలోని కార్మికశాఖ కార్యాలయంలో మంత్రిని ఎంపీ సత్యవతి కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అచ్యుతాపురంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థలపరిశీలన పూర్తి అయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్టు ఆమె చెప్పారు.

# విశాఖలో క్రికెట్ పండగ

- నవంబర్‌లో టీ–20, వచ్చే ఫిబ్రవరిలో టెస్ట్ మ్యాచ్
- ఖరారు చేసిన బీసీసీఐ



మాట్లాడుతున్న ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

**విశాఖ స్పోర్ట్స్:** విశాఖకు క్రికెట్ పండగ వచ్చేస్తోంది. భారత జట్టు సొంతగడ్డపై ఆడే రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు వైఎస్సార్ స్టేడియంలో మరోసారి విశాఖ అభిమానులను ప్రత్యక్షంగా అలరించనున్నాయి. ఆస్ట్రేలియాతో టీ–20 సిరీస్‌లో తొలిమ్యాచ్ విశాఖలో ప్రారంభం కానుండగా.. టెస్ట్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జట్టుతో రెండో మ్యాచ్‌ను ఇక్కడే ఆడనుంది. ప్రపంచ వరల్డ్ క్రికెట్ కప్ ముగిసిన వెంటనే ఆస్ట్రేలియాతో విశాఖ వేదికగా టీ–20 సిరీస్ ప్రారంభం అవుతుంది.

భారత్ తొలిసారిగా సోలోగా వరల్డ్ కప్‌కు ఆతిథ్యమిస్తోంది. ఇప్పటికే మూడు సార్లు భారత్ వేదికగా వరల్డ్‌కప్ క్రికెట్ పోటీలు జరిగాయి. మూడుసార్లూ మన సరిహద్దు జట్లతో కలిసి ఆతిథ్యమిచ్చాం. కానీ ఈసారి సోలోగానే భారత్ ఆతిథ్యమిస్తోంది. అయితే ఈ సారి టెస్ట్ నిర్వహించే అర్హత ఉన్న కొన్ని వేదికలకు ప్రపంచకప్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం దక్కలేదు. అలాంటి ఐదు నగరాల్లో బీసీసీఐ మూడు విదేశీ జట్లతో సిరీస్‌కు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌కు ముందు భారత్‌లో వన్డే సిరీస్ ఆడనుంది. వరల్డ్‌కప్ ముగిసిన నాలుగు రోజుల అనంతరం టీ–20 సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ పొట్టి ఫార్మాట్ సిరీస్ విశాఖ వేదికగా నవంబర్ 23న ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్‌తో టెస్ట్ మ్యాచ్‌ను ఇదే వేదికపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు భారత్ జట్టు ఆడనుంది.

**బీసీసీఐ కార్యదర్శికి ధన్యవాదాలు**

విశాఖకు రెండు మ్యాచ్‌లు కేటాయించిన బీసీసీఐ కార్యదర్శి జై షాకు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి ధన్యావాదాలు చెప్పారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు విశాఖ వేదిక కాకపోవడాన్ని కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి.. జై షా దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. జై షా ఇచ్చిన హామీ మేరకు ఆస్ట్రేలియాతో టీ–20 మ్యాచ్, ఇంగ్లాండ్‌తో టెస్ట్ మ్యాచ్‌కు అవకాశమిచ్చారన్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో విశాఖ వేదికగా నిబంధనల మేర మ్యాచ్‌ను విజయవంతం చేయడంతో తొలి ప్రాధాన్యమిచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ స్టేడియంలో ఇప్పటి వరకు 17 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌లు ప్రస్తుత కౌన్సిల్ పర్యవేక్షణలోనే జరగ్గా.. ఇప్పుడు మరో రెండు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. దేశవాళీ మ్యాచ్‌లకు విశాఖ వేదికగా నిలవనుందని వెల్లడించారు. కౌన్సిల్ కోశాధికారి ఎ.వి. చలం, సీఎఫ్‌వో నవీన్, గేమ్ పర్యవేక్షణాధికారి ఎంఎస్ కుమార్ పాల్గొన్నారు.

## స్పష్టమైన ఆధారాలు ఉంటేనే ఓటు తొలగింపు

- డీఆర్వో వెంకటరమణ



రాజకీయపార్టీల నేతలతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

**తుమ్మపాల:** ఓటు తొలగించాలంటే స్పష్టమైన పూర్తి ఆధారాలు ఉండాలని జిల్లా అదనపు ఎన్నికల అధికారి, డీఆర్వో పి.వెంకటరమణ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయపార్టీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌స్థాయి ఏజెంట్లు కచ్చితంగా ఆ బూత్ ఓటర్లై ఉండాలని చెప్పారు. బీఎల్‌వో వెంట రాజకీయపార్టీల నాయకులు, వలంటీర్లు వెళ్లరాదని సూచించారు. ఓటు రద్దు చేయడానికి కుటుంబసభ్యుల సంతకంతో ఫారం–7 తప్పక తీసుకోవాలని తెలిపారు. నోటీసు సంబంధిత ఇంటికి, సచివాలయంలో అంటించడం జరుగుతుందన్నారు. ఆధార్‌నంబర్ లేకపోయినా నివాసమున్న చోట బ్యాంకు అకౌంట్, గ్యాస్ నంబర్, ఎలక్ట్రికల్ బిల్లు మొదలైన వాటితో ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్లలో డోర్ నంబర్లకు సంబంధించి వివరణ ఇస్తూ డోర్ నంబర్ తర్వాత 1ఎ, 1బి క్రమంలో నంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, రాజకీయపార్టీల నేతలు గొర్లె సూరిబాబు, ఎస్.వి.వి.రామచంద్రరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల హరనాథబాబు, డి.సంతోష్, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

**హుకుంపేట/చోడవరం రూరల్ :** పెళ్లయి ఏళ్ల గడుస్తున్నా సంతానం కలగక పోవడంతో కట్టుకున్న భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేయడంతో మనస్తాపానికి గురైన గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన భర్తకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ తీర్పు చెప్పారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకటరావు, హుకుంపేట ఎస్ఐ సతీష్ వేర్వేరుగా తెలిపిన వివరాలివి.

హుకుంపేటకు చెందిన పడమట మాధవికి లక్ష్మణరావుతో అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నక్కలపాలెంలో 2015 మే 5వ తేదీన వివాహం జరిగింది. కొన్నేళ్లు వారి కాపురం సజావుగానే సాగింది. అయితే సంతానం కలగకపోవడంతో భర్తతో పాటు కుటుంబ సభ్యుల నుంచి మాధవికి వేధింపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 2021 ఫిబ్రవరి 9న భర్త, కుటుంబ సభ్యుల వేధింపులకు తట్టుకోలేక హుకుంపేటలోని తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన మాధవి ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో మాధవి భర్త పడమట లక్ష్మణరావు, మామ తిరుపతి గుప్తా, అత్త కన్నాకుమారి, చిన మామ సత్యనారాయణ, వారి బంధువు ఉడా శ్రీనివాసరావులు ప్రతి రోజు తన కుమార్తె మాధవిని గొడ్రాలివని, నువ్వు వెళ్లిపోతే భర్త లక్ష్మణరావుకు వేరే వివాహం చేస్తామని వేధింపులకు పాల్పడడం వల్లే తన కుమార్తె మృతి చెందిందని మృతురాలి తండ్రి కామరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు పాడేరు సీఐ సుధాకర్ కేసు దర్యాప్తు నిర్వహించి నిందితులు ఐదుగురిపై ఐపీసీ 306,498ఎ రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కోర్టులో ఛార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టులో విచారణ అనంతరం ప్రధాన నిందితుడు మృతురాలి భర్త లక్ష్మణరావుకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రెండు వేలు నగదు జరిమాన విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు వారాల జైలు శిక్షను విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఇతర నిందితులపై మోపిన నేరం రుజువు కానందున వారిని నిర్దోషులుగా పేర్కొంటూ వారికి విముక్తి కలిగించారు.

## రాజభాష గౌరవ్ సమ్మాన్ అవార్డుల ప్రదానం

**ఉక్కునగరం(విశాఖ) :** విశాఖలోని ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో రాజభాష అమలులో ప్రతిభ చూపిన వారికి బుధవారం రాజభాష గౌరవ్ సమ్మాన్ అవార్డులను ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన నగర అధికార భాషా అమలు కమిటీ (టోలిక్) సమావేశంలో టోలిక్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ 2021–22 సంవత్సరానికి రాజభాష కీర్తి పురస్కారాన్ని మళ్లీ అందుకోవడం ద్వారా టోలిక్‌కు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఇందుకు సహకరించిన సభ్య సంస్థలను అభినందించారు. ఈ సందర్భంగా హోమ్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార భాష డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ అధికార భాష అమలు పురోగతిని సమీక్షించారు. కేటగిరీ–1లో హెచ్‌పీసీఎల్–విశాఖ రిఫైనరీ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బీడీఎల్, విశాఖ పోర్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులు అందజేశారు. కేటగిరీ–2లో హెచ్‌పీసీఎల్–విశాఖ ప్రాంతీయ కార్యాలయం, ఈసీజీసీ లిమిటెడ్, సెయిల్ బ్రాంచ్ కార్యాలయం, గెయిల్, ఎఫ్‌సీఐ, ఈఎస్ఐలు బహుమతులు సాధించాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ హిందీ మ్యాగజైన్ 'విశాఖ ధార'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే, జీఎం లలన్‌కుమార్, టి.హైమావతి, వి సుగుణ పాల్గొన్నారు.



హెచ్‌పీసీఎల్ ఈడీకి షీల్డు అందజేస్తున్న భట్

## స్థాయీ సంఘ సమావేశం నేడు

**డాబాగార్డెన్స్(విశాఖ):** జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి సమావేశం ప్రారంభం కానుంది. మొత్తం 39 అంశాలను సభ్యులు చర్చించనున్నారు. కాగా.. గత స్థాయీ సభ్యుల పదవీ కాలం మంగళవారంతో ముగిసింది.

**నూతన సభ్యులతో తొలి సమావేశం**

ఇటీవల స్థాయీ సంఘానికి సంబంధించి ఎన్నిక నిర్వహించారు. నూతన స్థాయీ సభ్యులుగా అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్ల లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీ సౌజన్య ఎన్నికయ్యారు. వీరికిదే తొలి సమావేశం. పలు అభివృద్ధి పనులకు సంబంధించి స్థాయీ చైర్‌పర్సన్‌తో చర్చించి ఆమోదించనున్నారు.

## క్లుప్తంగా

### డిప్యూటీ సీఎంను కలిసిన కోలా గురువులు



కోలా గురువులను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం జిల్లా నూతన అధ్యక్షుడిగా, డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. దేవరాపల్లి మండలం తారువ క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిసి డిప్యూటీ సీఎంను సత్కరించారు. అనంతరం కోలా గురువులను ఆయన శాలువాతో సత్కరించి అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

### విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్ : విద్యార్థిని అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. సీఐ దాడి మోహనరావు తెలిపిన వివరాలివి. తుమ్మపాల గ్రామానికి చెందిన 19 ఏళ్ల వయసు గల విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల్లో డిగ్రీ చదువుతోంది. ఆమె బుధవారం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె ఆచూకీ తెలియకపోవడతో తల్లి భవానీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

### మొహర్రంలో జాగ్రత్తలు తప్పనిసరి

తుమ్మపాల: జిల్లాలో ముస్లింలు మొహర్రం పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న జరిగే పండగలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిశుభ్రత వాతావరణానికి దూరంగా ఉండాలని సూచించారు.

### జెండా కొండపై పర్యాటకుల సందడి



హుకుంపేట: ఉత్తరాంధ్రలో అత్యంత ఎత్తయిన శిఖరం సీతమ్మపర్వతం (జెండాకొండ)కు బుధవారం పర్యాటకులు తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఓలుబెడ్డా గ్రామం నుంచి కాలినడకన కొండపైకి చేరుకుని ప్రకృతి అందాలను తిలకించి మధురానుభూతి పొందారు.

# 29న బాలికలకు 2,500 సైకిళ్ల పంపిణీ

- 'అరబిందో' సహకారంతో అందిస్తాం: మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 29న నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9 తరగతి బాలికలకు అరబిందో కంపెనీ సహకారంలో ఉచితంగా 2500 సైకిళ్ల పంపిణీ చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో ఒక్కొక్క విద్యార్థినికి రూ.6 వేలు విలువచేసే సైకిల్ ఉచితంగా అందజేస్తామన్నారు. పట్టణ పరిధిలో వెయ్యి మంది, కశింకోట, అనకాపల్లి మండలాల్లో 1,500 మంది బాలికలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిని అరబిందో కంపెనీ చైర్మన్ అందజేస్తున్నట్లు చెప్పారు. సైకిల్ తీసుకునే బాలికలు తమ తల్లిదండ్రులతో హాజరు కావాలని పిలుపునిచ్చారు. అరబిందో కంపెనీ సహకారంలో రెండు మండలాల్లో రూ.2.50 కోట్లతో వివిధ ప్రాంతాల్లో కల్యాణ మండపాలు నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినికల్‌లు వచ్చే నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నేటి వరకూ చేసిన పనులకు కాంట్రాక్టర్లుకు నిధులు జమ చేసిందని, ఎక్కడైనా చిన్నచిన్న సమస్యతో పనుల్లో జాప్యం జరిగినట్లయితే త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆయా ప్రాంతాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో 227 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఈసారి అదనంగా మరో 24 పోలింగ్ బూత్‌లు పెరిగాయని, మొత్తం 251 పోలింగ్ బూత్‌లు కానున్నాయన్నారు. ప్రతీ గ్రామంలో పోలింగ్ బూత్ ఏజెంట్లు పేర్లను పార్టీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పార్టీ కశింకోట మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, పార్టీ సీనియర్ నేతలు ఎం.గోవింద, మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉసురు తీసిన మూఢ నమ్మకం

- మహిళ అనుమానాస్పద మృతి కేసులో పురోగతి
- చెడువు అనుమానంతో హత్య చేసినట్టు నిర్ధారణ
- ఇద్దరికి రిమాండ్



అరెస్టు చేసిన ఇద్దరు నిందితులతో పోలీసులు

కొయ్యూరు : కంప్యూటర్ యుగంలోను మూఢ నమ్మకాలు పోవడం లేదు. తాజాగా అనుమానాస్పద మృతి కేసు చివరకు హత్యగా నిర్ధారణ అయింది. చెడువు అనుమానంతో మహిళను చంపిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వాటి వివరాలను సీఐ స్వామినాయుడు బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో నల్లబిల్లికి చెందిన పాంగి రస్కో అనుమానాస్పదంగా గ్రామం సమీపంలో మరణించింది. దీనిపై కుటుంబ సభ్యులు ఎవరో కావాలని చంపేశారని, విచారణ చేయాలని పోలీసులను కోరారు. దీనిపై సీఐ స్వామినాయుడు, మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ విచారణ చేపట్టారు. రస్కో హత్యకు మూఢ నమ్మకం కారణంగా నిర్ధారించారు. నల్లబిల్లికి చెందిన పాంగి లక్ష్మణరావు, సీందరి అప్పారావు కలిసి రస్కోను హత్య చేశారని తేలింది. దీంతో నిందితులను పట్టుకోవడానికి పోలీసులు అనేక చోట్ల గాలించారు. చివరకు వారు బూదరాళ్ల వీఆర్‌వో పూజారి గంగాధర్ ఇంటి వద్ద ఉన్నట్టుగా తెలుసుకున్నారు. పోలీసులను చూడగానే నిందితులు ఇద్దరూ లొంగిపోయారని సీఐ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

**చేతబడి నెపంతో మహిళ హత్య..!**

మారేడుమిల్లి : చేతబడి చేస్తుందనే నెపంతో ఓ గిరిజన మహిళను హత్య చేసినట్టు తెలిసింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చావడికోట పంచాయతీ పరిధిలోని బంధ గ్రామానికి చెందిన ఓ మహిళ చేతబడి చేస్తుందని అనుమానంతో అదే గ్రామంలోని కొంత మంది తాడుతో ఆమె గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్టు తెలిసింది. మారేడుమిల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాయకరావుపేట: నేషనల్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పరవాడ మండలం వెన్నెలపాలెంలో ఈ నెల 25న నిర్వహించిన అండర్–14 యోగా పోటీల్లో బి.దేవాన్ష్ నాయుడు (7వ తరగతి), పి.సోహన్ (5వ తరగతి) చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారు. బి.దేవాన్ష్ నాయుడు సంప్రదాయ యోగా విభాగంలో, రిథమిక్ యోగా విభాగంలో మొదటి స్థానాన్ని, పి.సోహన్ సంప్రదాయ యోగా విభాగంలో తృతీయ, రిథమిక్ యోగా విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్. వి.కె. నరసింహారావు, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు అపర్ణ, నీలాదేవి, సంధ్యారాణి, యోగా గురువు సురేష్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# సూక్ష్మసాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- సూక్ష్మసాగు నీటి వనరులు ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి



వెదురుపల్లి యూనిట్‌ను పరిశీలిస్తున్న సూక్ష్మ సాగునీటి వనరుల ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి

నాతవరం: జిల్లాలో బిందు, తుంపర సేద్యం ద్వారా సాగు చేసేందుకు 1,361 మంది రైతులు 1,448 హెక్టార్లకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని జిల్లా సూక్ష్మ సాగునీటి వనరులు ప్రాజెక్టు డైరెక్టరు జి.వి.లక్ష్మి తెలిపారు. మండలంలోని వెదురుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన బిందు, తుంపర సేద్యం యూనిట్లను ఆమె బుధవారం పరిశీలించారు. తర్వాత పెదగొలుగొండపేట, గుమ్మడిగొండ ప్రాంతాల్లో కొత్తగా దరఖాస్తులు చేసుకున్న రైతుల భూములలో తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విధంగా సాగు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ విధంగా సాగు చేయడం వల్ల తక్కువ కూలీలు, పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఐదెకరాల లోపు రైతుకు బిందు సేద్యానికి 90 శాతం, తుంపర సేద్యానికి 55 శాతం రాయితీపై యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రైతు భూమిలో నీటి సదుపాయంతోపాటు విద్యుత్ కనెక్షన్ ఉండాలన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి లక్ష్యాన్ని మించి రైతుల ఆర్బీకేల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. జిల్లాలో ఇంతవరకు 15 హెక్టార్లలో కొత్త యూనిట్లు ఏర్పాటు చేశామని, మరో 485 హెక్టార్లలో 486 మంది రైతులకు ఏర్పాటుకు క్షేత్రస్థాయి పరిశీలన చేశామన్నారు. 110 మందికి 110 హెక్టార్లలో యూనిట్లు ఏర్పాటుకు కలెక్టరు ఆమోదం వచ్చిందన్నారు. ప్రభుత్వం గుర్తించిన నాలుగు కంపెనీల ద్వారా సామగ్రి అందిస్తామన్నారు.

## రూ.2లక్షల విలువైన గంజాయి పట్టివేత

- నిందితుడి అరెస్టు, బొలేరో వాహనం స్వాధీనం



పట్టుకున్న గంజాయి, నిందితుడితో సీఐ సత్యనారాయణ,ఎస్‌ఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది

ముంచంగిపుట్టు : మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు గంజాయి రవాణాకు ఉపయోగించిన బొలేరో వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారంతో లబ్బూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేస్తుండగా బరడ నుంచి లబ్బూరు జంక్షన్ వైపు వస్తున్న బొలెరో వాహనం నిలుపుదల చేసి అందులో ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పోలీసులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరు పోలీసులకు పట్టుబడగా మరొకరు తప్పించుకున్నాడు. వాహనం తనిఖీ చేయగా 10 బస్తాలలో ఉన్న గంజాయిని గుర్తించారు. గంజాయిని, బొలెరోను సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 200 కిలోలు ఉందని, దీని విలువ రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ లబడపుట్టు గ్రామానికి చెందిన వంతాల హరిగా గుర్తించామని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సత్యనారాయణ తెలిపారు. పరారైన మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఎస్‌ఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

## అక్రమంగా టేకు కలప తరలింపు

- రెండు వాహనాలు సీజ్



టర్పాలిన్ కప్పి బొలేరో వాహనంలో తరలిస్తున్న కలప

దేవరాపల్లి: రెండు బొలేరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నామని అటవీ శాఖ చోడవరం రేంజర్ ఇ.వి. వర్మ తెలిపారు. బుధవారం రాత్రి అనంతగిరి మండలం నుంచి అక్రమంగా తరలిస్తుండగా దేవరాపల్లి సమీపంలోని చెక్‌పోస్టు వద్ద వీటిని పట్టుకున్నామన్నారు. కలప తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని రేంజర్ తెలిపారు. రాత్రి సమయంలో వాహనాలను పట్టుకోవడంతో ఎంత మేర కలప ఉంది, ఎంత విలువ చేస్తుందో అంచనా వేయలేకపోయామని, గురువారం ఉదయం వెల్లడిస్తామని వివరించారు.

## నారు మడుల్లో సస్యరక్షణ చర్యలు

- చెట్టుపల్లిలో కేవీకే శాస్త్రవేత్తల పరిశీలన



నారుమడులను పరిశీలిస్తున్న కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు

నర్సీపట్నం: వర్షాలకు నారు మడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్.సత్తిబాబు, సౌజన్య, శంకర్ రైతులకు సూచించారు. మండలంలో చెట్టుపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో వరి నారుమడులను ఏవో అప్పారావుతో కలిసి వారు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వరి నారుమడుల్లో ఇనుము లోపం, పాచి తెగులు ఉన్నట్లు గుర్తించారు. ఇనుము లోపం నివారణకు 20 గ్రాముల అన్నభేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పాచి తెగులు నివారణకు హెక్సకాంజోల్ లేక ప్రొపిసినాజోల్ 1ఎంఎల్ మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని వివరించారు.

## తల్లి తిరిగిరాని లోకాలకు...తండ్రి జైలుకు

- అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు



అనాథలైన చిన్నారులు

మునగపాక : ఒకవైపు తండ్రి జైలులో మరో వైపు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయిన తల్లి. దీంతో అనాథలైన చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలోని తోటాడకు చెందిన కొత్తలంక దామినిని అనుమానంతో భర్త నూకప్పారావు హత్య చేసిన సంగతి తెలిసిందే. దీంతో అభం శుభం తెలియని వారి పిల్లలు అనాథలుగా మారారు. నూకప్పారావు, దామిని దంపతులకు ముగ్గురు సంతానం. భార్య ప్రవర్తన బాగోలేదని భావించిన భర్త ఆమె మెడకు చున్నీ బిగించి హత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. నిందితుడిని పోలీసులు జైలుకు తరలించారు. దీంతో అనాథలుగా మారిన పిల్లల భవిష్యత్తు ఏమిటో అని చూసిన వారు కంటతడి పెడుతున్నారు. ప్రస్తుతం పిల్లలు ముగ్గురూ నానమ్మ సంరక్షణలో ఉన్నారు. కుమారుడు జైలుకు వెళ్లడంతో పోషించే దిక్కులేక ఆమె పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. దామిని, నూకప్పారావుల కూతురు అరుణ శ్రీ మూడో తరగతి చదువుతోంది. పెద్ద కుమారుడు ప్రవీణ్ ఒకటో తరగతి చదువుతుండగా, రెండో కుమారుడు రాజు స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నాడు. తల్లీతండ్రి దూరమవడంతో ఇక వారి ఆలనా పాలనా ఎవరు చూస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## 80 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు.. మరో ఇద్దరు పరారీ

జి.మాడుగుల: మహారాష్ట్రకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు గంజాయితో కారు పట్టుబడింది. మహారాష్ట్రకు చెందిన మసూద్ ఖాన్ కమల్, షేక్ మహమ్మద్ జమీల్, మరో ఇద్దరు ఆంధ్ర–ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో 80 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. మైదాన ప్రాంతానికి కారులో తరలిస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. నలుగురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా మిగతా ఇద్దరు పరారైనట్టు ఆయన చెప్పారు. పట్టుబడిన వారి నుంచి గంజాయితోపాటు కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. నిందితులు ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

## తన తండ్రిని చంపాడన్న కక్షతో హత్య



హతుడు శానాపతి అప్పారావు



పోతుమంచి ఆంజనేయులు(అంజి)

చోడవరం రూరల్ : మండలంలోని బెన్నవోలు గ్రామంలో బుధవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో జరిగిన హత్యోదంతం మండలంలో కలకలం రేపింది. గ్రామంలోని రామాలయం వీధిలో పొరుగునే ఉంటున్న శానాపతి కన్నంనాయుడు కుమారుడు అప్పారావుపై పోతుమంచి అంజనేయులు అలియాస్ అంజి ఇంట్లోకి దూరి కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య సమాచారం అందుకున్న చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. సీఐ కథనం ప్రకారం.. బెన్నవోలు గ్రామానికి చెందిన పోతుమంచి పోతురాజు అదే గ్రామానికి చెందిన శానాపతి కన్నంనాయుడుకు రూ.50 వేల అప్పు ఇచ్చాడు. ఈ అప్పు తీర్చే విషయంలో గతేడాది డిసెంబర్‌లో ఇరు కుటుంబాలు గొడవ పడ్డాయి. గ్రామ పెద్దల సమక్షంలో తగవు తేలకపోవడంతో కళ్లం పాక వద్ద నిద్రిస్తున్న పోతురాజుపై కన్నంనాయుడు గొడ్డలితో నరికి గాయపరిచాడు. అపస్మారక స్థితిలో పడిఉన్న పోతురాజును అతని కుమారుడు ఆంజనేయులు విశాఖ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాడు. కన్నంనాయుడుపై హత్యాయత్నం కేసు నమోదయ్యింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన పోతురాజు రెండు రోజుల క్రితం మృతి చెందాడు. రూ. 50 వేల అప్పు తీర్చకపోగా బాకీ తీర్చాలని అడిగినందుకు తన తండ్రిని హతమార్చారని, తన తండ్రికి వైద్యం నిమిత్తం రూ.ఆరు లక్షల మేరకు ఖర్చు చేసినా ఫలితం దక్కలేదన్న కసితో అంజనేయులు బుధవారం రాత్రి కత్తితో కన్నంనాయుడు ఇంట్లోకి ప్రవేశించి శానాపతి అప్పారావును హతమార్చాడు. హతుడు అప్పారావుకు భార్య, పాప, బాబు ఉన్నారు. బాబు విజయనగరంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసమని వెళ్లాడు. కేసు దర్యాప్తు ప్రారంభించామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

## పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి



రాజు మృతదేహం రాజు( ఫైల్)



మృతి చెందిన పశువులు

అరకులోయ రూరల్: పిడుగుపాటుకు పశువుల కాపరితోపాటు నాలుగు పశువులు మృతి చెందాయి. మండలంలోని మాదల పంచాయతీ బొర్రిగూడ గ్రామానికి చెందిన గుబాయి రాజు(50) బుధవారం పశువుల కాపలా నిమిత్తం గ్రామ సమీపంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఈ సమయంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ప్రాంతంలో మరో నాలుగు పశువులు మృతి చెందాయి. వీటిలో మృతుడికి చెందినని రెండు, అదే గ్రామానికి చెందిన వంతాల గురుకు చెందిన రెండు పశువులు ఉన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతి చెందిన పశువుల విలువ రూ.1.6లక్షల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఎంపీటీసీ రాంచందర్, సచివాలయం కన్వీనర్లు శెట్టి గోపాల్, సన్యాసిరావు, గురుమూర్తి, వైఎస్సార్ సీపీ నేతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

### ఘాట్‌రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు



నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సీలేరు : సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ధారాలమ్మ తల్లి ఘాట్ రోడ్డులో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటువైపుగా భద్రాచలం నుంచి వస్తున్న బస్సులో ప్రయణికులను ఎక్కించి గమ్యానికి చేర్చారు. బస్సుకు సంబంధించిన బెల్ట్ తెగిపోవడంతో నిలిచిపోయినట్లు గుర్తించారు. విశాఖ నుంచి మెకానిక్ వచ్చి సరి చేసి వెళ్లారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- సర్వీసు వైరు తగిలి ప్రమాదం



సత్తిబాబు మృతదేహం

అడ్డతీగల: మండలంలోని భీముడుపాకలలో బుధవారం విద్యుత్ షాక్ వల్ల నేబుల సత్తిబాబు(29) అనే యువకుడు మృతి చెందాడు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సత్తిబాబు పెంకుటిల్లు పైకప్పు నుంచి వర్షం నీరు లీకై ఇంట్లోకి వచ్చేస్తోంది. లీకేజీలు అరికట్టేందుకు బుధవారం సత్తిబాబు ఇంటి పైకప్పుపైకి ఎక్కి టార్పాలిన్ కట్టేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో విద్యుత్ సర్వీసు వైర్ తగిలి షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. చికిత్స అందించే లోపు మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## క్లుప్తంగా

### నెయ్యిలవీధిలో 'జగనన్న సురక్ష' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక నెయ్యిలవీధి కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం జరగనున్నట్లు జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

### దాడికి పాల్పడిన వ్యక్తులపై ఫిర్యాదు



ఎస్‌ఐ సింహాచలంకు ఫిర్యాదు చేస్తున్న భానుమూర్తి యాదవ్

అనకాపల్లిటౌన్: ఈ నెల 24న స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో తనపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకుడు బోయిన భానుమూర్తి యాదవ్ బుధవారం స్థానిక పట్టణ ఎస్‌ఐ సింహాచలంకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట పార్టీ నేతలు సత్యనారాయణ, సేనాపతి ఈశ్వరరావు, ఆర్.ఆర్.నాయుడు, బి.బాలమురళి ఉన్నారు.

### వర్షంతో రైతుల హర్షం



కశింకోటలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు

కశింకోట: మండలంలో మంగళవారం రాత్రి భారీగా, బుధవారం సాయంత్రం సాధారణ వర్షం కురిసింది. దీంతో పంట భూములు పదును ఎక్కాయి. రైతులు దమ్ము, దుక్కి దున్ని ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. వరి నారు ఏపుగా ఎదగడానికి, నారు మళ్లు వేయడానికి, దుక్కులు దున్నడానికి ఈ వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు చెప్పన్నారు. వేసవి ఎండలకు భూములు ఎండిపోయి ఉండటంతో భారీ వర్షం కురిసినప్పటికీ పెద్దగా నీరు నిల్వలేకుండా ఎక్కువ భాగం ఎక్కడికక్కడ భూముల్లో ఇంకిపోతోంది. వర్షం పడినప్పుడు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది చెందుతున్నారు. ఆర్టీసీ బస్సు స్టేషన్ ముందు, పశువుల ఆస్పత్రికి వెళ్లే రోడ్డు పల్లపు ప్రాంతంలో నీరు భారీగా నిలిచింది.

### పీహెచ్‌సీ పనులకు శంకుస్థాపన నేడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొనాల్సిందిగా కోరారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| బేబి | : రాజా |
| హిడింబ | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| మహావీరుడు | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| హత్య | : షిర్డిసాయి |
| మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) | : పర్తిసాయి |
| కార్తీక | : వెంకటేశ్వర |
| అన్నపూర్ణ ఫొటో స్టూడియో | : శ్రీసత్య |
| సామజవరగమన | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# ఎన్నో ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ

అనకాపల్లి.. కొత్త జిల్లాగా ఏర్పడ్డాక కార్యాలయాలు పెరిగాయి. అధికారుల రాకపోకలు జోరందుకున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తీవ్రమైంది. పట్టణం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే పెరుగుబజార్–గాంధీబొమ్మ జంక్షన్ రోడ్డయితే.. మరీ దారుణం. కిలో మీటర్ ప్రయాణానికీ చాలాసార్లు గంటకుపైనే పట్టే పరిస్థితి. ఇక ఇదంతా గతం. 20 అడుగుల ఈ రోడ్డును 60 అడుగులకు విస్తరించే చర్యలు ఊపందుకున్నాయి. ఇప్పటికే రోడ్డు విస్తరణకు వీలుగా నిర్మాణాల తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి.





పెరుగుబజార్ రోడ్డు (ఇన్‌సెట్) రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- పెరుగు బజార్ రోడ్డుకు మహర్దశ
- 20 అడుగుల నుంచి 60 అడుగులకు విస్తరణ
- భవనాల నష్ట పరిహారానికి రూ.1.54కోట్లు
- రోడ్డు విస్తరణకు అంచనా వ్యయం రూ.2.5 కోట్లు

తుమ్మపాల: ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రామీణ వాణిజ్య కేంద్రంగా పేరొందిన అనకాపల్లి పట్టణం ఇప్పుడు జిల్లా కేంద్రంగానూ శరవేగంగా అభివృద్ధిని సాధిస్తోంది. ఇటీవల కాలంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజల రాకపోకలు పెరిగాయి. వాణిజ్య, వ్యాపార అవసరాలతో పాటు రైల్వే ప్రయాణాలకు జిల్లావాసులు నిత్యం అనకాపల్లి వస్తుంటారు. పట్టణంలో మెయిన్ రోడ్డు నుంచి పెరుగుబజార్ రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు ప్రయాణికులు ఆపసోపాలు పడేవారు. ట్రాఫిక్ రద్దీతో పోలీసులు నిత్యం తలలుపట్టుకునే ఈ రోడ్డు అతి త్వరలో 60 అడుగుల వెడల్పున విస్తరణకు నోచుకోనుంది.

**పదిహేనేళ్ల కల**

పట్టణంలో ఉన్న ప్రధాన రహదారుల్లో పెరుగుబజార్- గాంధీబొమ్మ రహదారి అత్యంత రద్దీగా ఉంటుంది. 15 ఏళ్ల క్రితం విస్తరణకు ప్రతిపాదించినప్పటికీ రకరకాల కారణాలతో రోడ్డు విస్తరణ కలగానే మిగిలిపోయింది. ఈ రహదారి విస్తరణతో పట్టణ అభివృద్ధికి మెరుగైన అవకాశాలుంటాయన్న ఆలోచనతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ తీసుకున్నారు. దీంతో ఈ రోడ్డు విస్తరణకు చర్యలు మొదలయ్యాయి. ఇరువైపులా వాణిజ్య, వ్యాపార సముదాయాలతో అత్యంత రద్దీగా ఉండే ఈ 20 అడుగుల రహదారిని 60 అడుగుల వెడల్పున విస్తరించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమయ్యింది. ఇరువైపులా చెరో 20 అడుగుల వెడల్పున భవనాలను తొలగించేందుకు సర్వే చేశారు. గత పది రోజులుగా విస్తరణకు వీలుగా భవనాల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. మరో వారం రోజుల్లో భవనాల తొలగింపు పూర్తిచేసి నేరుగా రైల్వేస్టేషన్‌కు రహదారి పనులు చేపట్టనున్నట్లు అధికారులు చెప్తున్నారు.

**అంచనా వ్యయం రూ.2.50 కోట్లు**

పెరుగుబజార్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు సుమారు కిలో మీటర్ పొడవున, 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించి, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేస్తూ అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.2.50 కోట్లు అంచనా వ్యయంతో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం నివేదిక సిద్ధం చేసింది. ప్రసుత్తం రోడ్డు విస్తరణలో భాగంగా భవనాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఆగస్టు మొదటి వారం నుంచి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు చెప్తున్నారు. భవనాల తొలగింపు అనంతరం, ముందుగా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను పూర్తిచేయనున్నారు. విస్తరణలో తొలగిస్తున్న భవనాలకు నష్ట పరిహారంగా రూ.1.54 కోట్లు చెల్లించారు.

### రైల్వే స్టేషన్‌కు చేరుకోవడం ఈజీ



పట్టణంలో మెయిన్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు ఇదే ప్రధాన రహదారి. కానీ ఈ రోడ్డుకు ఇరువైపులా అత్యధికంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండటంతో వాహనాలు, ప్రజల రాకపోకలతో నిత్యం రద్దీగానే ఉంటుంది. రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది. ఈ కారణంగా సమయానికి స్టేషన్‌కు చేరుకోలేని సందర్భాలూ ఉన్నాయి. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే సులభంగా, వేగంగా స్టేషన్‌కు చేరుకోవచ్చు.

– బీమవరపు గోవింద్, కోట్ని వీధి, అనకాపల్లి

### అతి త్వరలో పనులు ప్రారంభిస్తాం



పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే పెరుగుబజార్ రోడ్డు విస్తరణ పనులు అతి త్వరలో ప్రారంభిస్తాం. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగం విస్తరణపై నివేదిక సిద్ధం చేసింది. విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుచేస్తాం. 60 అడుగుల వెడల్పున చేపట్టనున్న ఈ రహదారికి రూ.2.5 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. విస్తరణలో భాగంగా ఇప్పటికే 90 శాతం భవన నిర్మాణాల తొలగింపు పూర్తిచేశాం.

– ఎస్.వెంకటరమణ, జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన్

## ప్రతి ఓటుకు ఇంటి నంబరు నమోదు

తహసీల్దార్లు రమేష్‌బాబు, లక్ష్మి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు



ఎం.అలమండలో ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

కె.కోటపాడు: ఇంటింటా ఓటర్ల సర్వేను బూత్ లెవెల్ అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాయంత్రం బీఎల్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 21వ తేదీలోగా మండలంలోని 62 పోలింగ్ బూత్‌ల పరిధిలో 48,538 ఓటర్ల వివరాలను ఇంటింటా సర్వేలో పరిశీలించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రతీ ఓటుకు వారి ఇంటి నంబర్‌ను నమోదు చేయాలని సూచించారు. పది ఓట్లు కన్నా ఎక్కువగా ఆ కుటుంబంలో ఉండే రెండో ఇంటి నంబర్ నమోదు చేయాలన్నారు. డిసెంబర్ 31వ తేదీకి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారి నుంచి ఓటుహక్కు నమోదుకు దరఖాస్తు స్వీకరించాలని తెలిపారు. అదే విధంగా ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు, మరణించిన, పెళ్లయి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి ఓట్లను తొలగించాలని వివరించారు. సమావేశంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

**పక్కాగా ఓటరు సర్వే**

దేవరాపల్లి: బీఎల్వోలు ప్రతీ ఇంటికి వెళ్లి పక్కాగా సర్వే చేయాలని తహసీల్దార్ ఎం. లక్ష్మి సూచించారు. ఎం. అలమండలో పోలింగ్ కేంద్రం 167లో ఇంటింటా ఓటరు సర్వేను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్వోలు తమకు నిర్దేశించిన ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేయాలన్నారు. ఇంటింటా సర్వేలో గుర్తించిన అంశాలను ఎన్నికల కమిషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వే పట్ల బీఎల్వోలు నిర్లక్ష్యం వహించకుండా వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు పాల్గొన్నారు.

## డైట్‌లో ముగిసిన డీప్ లెర్నింగ్ కోర్స్



సదస్సులో పాల్గొన్న కళాశాల అధ్యాపక బృందం

అనకాపల్లిటౌన్: డీప్ లెర్నింగ్ కోర్స్, లైవ్ ప్రాజెక్టులపై విద్యార్థులు అవగాహన పెంచుకున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. కళాశాల ఆవరణలో డేటా ప్రో ఆధ్వర్యంలో రెండు వారాలుగా జరుగుతున్న డీప్ లెర్నింగ్ కోర్స్, లైవ్ ప్రాజెక్ట్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. సీఎస్‌ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు డీప్ లెర్నింగ్ అల్గారిథమ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి కె.సుజాత, అకడమిక్ డీన్ డాక్టర్ పార్వతి, అసోసియేట్ డీన్ కృష్ణనాగ్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షురాలిగా పునితాయాదవ్

అనకాపల్లిటౌన్: అనకాపల్లి రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షురాలిగా జె.పునితాయాదవ్ ఎన్నికయ్యారు. స్థానిక రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ కార్యదర్శిగా ఎ.లక్ష్మణ్, కోశాధికారిగా హిందూలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు మాట్లాడుతూ క్లబ్ పదవీకాలం ఏడాదిపాటు ఉంటుందన్నారు. ప్రతీ గురువారం స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో రోటరాక్ట్ క్లబ్ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరాక్ట్ చైర్మన్ కె.రమణ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా కోటయ్య జయంతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం దుప్పుతూరులో చేనేత సంఘాల సృష్టికర్త ప్రగడ కోటయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, తెడ్లపు సతీష్, రాజు చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును దుప్పుతూరు భద్రావతి చేనేత కార్మికుల సంఘం అభివృద్ధికి అందించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పరవాడలో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పరవాడ: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లతో కలిసి ఆయన గ్రామంలో బుధవారం పర్యటించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద నిల్వనీటిని సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు సిరపరపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్

పరవాడ: పెండింగ్ చలానాలపై మండలంలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనకాపల్లి ఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది బుధవారం ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేసి, పెండింగ్ చలానాలను రాబట్టారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ మీ సేవ, ఈ చలానా యాప్ ద్వారా నిర్ణీత గడువులోపు పెండింగ్ చలానాలు చెల్లించాలని వాహనచోదకులకు సూచించారు.

ట్రాఫిక్ నియమాలను వాహన చోదకులు పాటించి, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. అతి వేగం, పరిమితికి మించిన లోడుతో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్న పరవాడ సీఐ ఈశ్వరరావు, సిబ్బంది

## ఇరిగేషన్ సబ్ డివిజన్ ఏర్పాటు

పాయకరావుపేట : నియోజకవర్గ కేంద్రం పాయకరావుపేటలో నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డీఈగా నియమితులైన ఎస్.జగదీశ్వరరావు తెలిపారు. నియోజకవర్గానికి ఒక సబ్ డివిజన్‌లో భాగంగా పాయకరావుపేటలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గల పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలు ఈ కార్యాలయం పరిధిలో ఉంటాయన్నారు. సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో డీఈగా జగదీశ్వరరావుతో పాటు, ఏఈగా జి.శ్రీరామమూర్తి, నక్కపల్లి, కోటవురట్ల మండలాల ఏఈగా జి.శ్యామ్‌గౌడ్, ఎస్.రాయవరం ఏఈగా అమీనా అక్బర్ భాను నియమితులయ్యారు. వీరిని సిబ్బంది అభినందించారు.

## అరబుపాలెం అభివృద్ధికి ఎస్‌బీఐ ఫౌండేషన్ కృషి



మాట్లాడుతున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అరబుపాలెం గ్రామాభివృద్ధికి ఎస్‌బీఐ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయంలో బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరబుపాలెంలో సమస్యల పరిష్కారానికి ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇటీవల 150 మంది రైతులకు రాయితీపై విత్తనాలు అందించినట్టు తెలిపారు. క్రిమి సంహారక మందులు కూడా రాయితీపై అందించాలని కోరారు. శ్మశానవాటికలో షెడ్ నిర్మాణానికి ఫౌండేషన్ ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పూజిత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పాపయ్యపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

- ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన వారికి ఉచితంగా ప్లాట్ల రిజిస్ట్రేషన్
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: మూడేళ్ల క్రితం ల్యాండ్‌పూలింగ్‌కు భూములిచ్చిన వారికి కోడూరు గ్రామంలో ప్రత్యామ్నాయ స్థలాల ఇస్తున్నామని, వీటికి ఉచితంగా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మండలంలోని కొండుపాలెం, పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమల లబ్ధిని కుటుంబాల వారీగా గణాంకాలతో సహా వివరించారు. 2020లో ల్యాండ్‌పూలింగ్‌కు స్థలాలిచ్చిన ఆ గ్రామాలకు చెందిన 75 మందికి వీలైనంత వేగంగా స్థలాలు రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు, రహదారులు విద్యుత్ సమస్యలు, ప్రధాన కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు నిర్మాణం, తాగునీటి ఇబ్బందులపై స్థానికులు మంత్రికి విన్నవించుకున్నారు. అక్కడే ఉన్న అధికారులను పిలిచి తక్షణమే ప్రజలకు కావలసిన ప్రాంతాల్లో తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలని, రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల వలన రాష్ట్రంలో పేదరికం చాలా వరకు తగ్గిందన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ తీసుకోలేని చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని, రాష్ట్ర ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పాపయ్యసంతపాలెం సర్పంచ్ అన్నం అప్పారావు, పాపయ్యపాలెం సర్పంచ్ తలారి సత్యనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెయ్యి ధ్రువపత్రాల పంపిణీ



ధ్రువపత్రాలను అందిస్తున్న సర్పంచ్ గోవిందరావు, ఎంపీడీవో నరసింహరావు

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు అందిస్తున్నట్టు సీహెచ్ఎన్ అగ్రహారం గ్రామ సర్పంచ్ కె.గోవిందరావు తెలిపారు. ఎంపీడీవో కె.వి.నరసింహరావు ఆధ్వర్యంలో మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయన్నారు. రాజకీయలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయని తెలిపారు. గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని అభ్యర్థించారు. అనంతరం వెయ్యి ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.

### మామిడిపాలెంలో 'గడప గడపకు' రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### కస్పావీధిలో 'గడప గడపకు' నేడు

కశింకోట: స్థానిక 4వ సచివాలయ పరిధిలోని కస్పావీధి ప్రాంతంలో గురువారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని, ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

## జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



కుమారపురంలో అర్హులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఏళ్ల తరబడి పలు ధ్రువపత్రాలకు నోచుకోనివారి పాలిట వరంగా మారడంతోపాటు, గ్రామస్థాయి సమస్యలకు పరిష్కారం చూపుతోందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్‌లు అన్నారు. మండలంలోని కుమారపురం గ్రామంలో తహసీల్దార్ జయప్రకాష్ బృందం, రాజవరంలో ఎంపీడీవో సాంబశివరావు బృందాలు బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. కుమారపురం గ్రామ సచివాలయ పరిధిలో 214 మందికి దరఖాస్తుదారులకు గ్రామ సర్పంచ్ పెరుమళ్ళ గోవిందమ్మ, తహసీల్దార్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీలాపు మహేష్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు. రాజవరం గ్రామ పరిధిలో 317 మంది దరఖాస్తుదారులకు సర్పంచ్ గోసల అమ్మాజీ, ఎంపీటీసీ గోసల మరిఐమ్మ, ఎంపీడీవో చేతుల మీదుగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, కాకాడ కృష్ణ, ఈవోఆర్డీ వైవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వరి నారుమళ్లలో పొడ తెగులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నక్కపల్లి: వరి నారుమళ్లకు పొడ తెగులు సోకుతోందని, రైతులు ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమళ్లను వారు పరిశీలించారు. గుల్లిపాడు, డొంకాడ, నామవరం, మంగవరం, గొడిచర్ల గ్రామాల్లో ఏవో ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. యలమంచిలి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అప్పలస్వామి, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఉద్యాన వన శాస్త్రవేత్త ఆర్ ప్రవీణ్ తదితరులు రైతులతో మాట్లాడారు. వరి నాడుమడుల్లో గుంపులుగా నారు చనిపోతున్న విషయాన్ని గుర్తించారు. ఇది పొడ తెగులు లక్షణమన్నారు. తెగులు ఉధృతి పెరగకుండా లీటర్ నీటికి 2 మి.లీ. చొప్పున హెక్సాకొనజోల్ మందును కలిపి, పిచికారీ చేయాలన్నారు. ఇప్పటికే 15 రోజులు దాటిపోయిన నారుమళ్లలో అంబటికాడ, తుంగ వంటి గడ్డి జాతి కలుపు మొక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జన వనరుల కేంద్ర వ్యవసాయాధికారి తులసీమణి, ఏఈవోలు సత్యనారాయణ, సురేంద్ర, రాజేష్, రజిత, రుఫియా తదితరులు పాల్గొన్నారు.